


EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
గురువారం
16-10-2025
పేజీలు: 02



## శ్రీశైలం మలన్న సన్నిధిలో
# ప్రధాని మోదీ..
### స్వామివారికి ప్రత్యేక పూజలు

ఏపీ పర్యటనలో భాగంగా శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్నారు ప్రధాని మోదీ. ఈ సందర్భంగా భ్రమరాంబ మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలో భాగంగా శ్రీశైలం మల్లన్నకు పంచామృతాలతో మోదీ రుద్రాభిషేకం చేశారు. అనంతరం భ్రమరాంబిక ఖడ్గమాల, కుంకుమార్చనలో పాల్గొన్నారు. దాదాపు 50 నిమిషాలపాటు మల్లన్న సన్నిధిలోనే ప్రధాని మోదీ గడిపారు. కాసేపట్లో శివాజీ స్ఫూర్తి కేంద్రానికి ప్రధాని మోదీ 12:35 వరకు శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ ధ్యానం చేయనున్నారు.

## మేడారం పనుల పర్యవేక్షణ ఆర్ అండ్ బికి బదిలీ..
# మంత్రుల మధ్య వివాదానికి తెర?

తెలంగాణలో మంత్రుల మధ్య అంతర్గత కలహాలకు దారి తీసిన మేడారం జాతర పనుల టెండర్ల వ్యవహారంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ పనుల పర్యవేక్షణ బాధ్యతలను రోడ్లు, భవనాల (R&B) శాఖకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం, ముఖ్యంగా ఎండోమెంట్స్ మంత్రి కొండా సురేఖ మరియు మరో మంత్రి మధ్యన టెండర్ల కేటాయింపు విషయంలో చోటుచేసుకున్నట్లుగా భావిస్తున్న వివాదం వేళ తీసుకోవడం గమనార్హం. పనుల స్వభావం, నాణ్యత మరియు నిర్ణీత కాలంలో పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని, దేవాదాయ శాఖకు పనులను పర్యవేక్షించేందుకు తగిన సాంకేతిక సామర్థ్యం లేదనే కారణాన్ని ప్రభుత్వం పేర్కొంది.

కోట్లాది మంది భక్తులు హాజరయ్యే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు సంబంధించిన మౌలిక వసతుల కల్పన పనులు అత్యంత పకడ్బందీగా జరగాల్సిన అవసరం ఉంది. కేవలం సాంకేతిక అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం ఈ బాధ్యతను R&B శాఖకు అప్పగించింది. పనుల నాణ్యత ప్రమాణాలు, సమయానికి పూర్తి చేసే విషయంలో R&B శాఖకు ఉన్న అనుభవం, నిపుణత ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా తెలుస్తున్నాయి. దేవాదాయ శాఖ వద్ద ఉన్న రికార్డులు, ఇతర పత్రాలను తక్షణమే R&Bకి అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించింది, తద్వారా పనుల ప్రగతిలో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలని భావిస్తోంది. ఎండోమెంట్స్ శాఖ మంత్రిగా ఉన్న కొండా సురేఖ పరిధిలో ఈ పనులు ఉన్నప్పటికీ,



సాంకేతిక కారణాల పేరుతో బాధ్యతలు R&Bకి మారడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయం వెనుక మంత్రుల మధ్యన నెలకొన్న అంతర్గత ఆధిపత్య పోరే కారణమని కొందరు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా రూ. 71 కోట్ల విలువైన టెండర్ల కేటాయింపులో ఒక మంత్రి జోక్యం చేసుకుంటు న్నారంటూ కొండా సురేఖ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లుగా వార్తలు వచ్చాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య, అధికారికంగా సాంకేతిక అంశాన్ని కారణంగా చూపినా, మంత్రుల మధ్య నెలకొన్న వివాదానికి ముగింపు పలకడానికేనని భావిస్తున్నారు. మంత్రుల మధ్య నెలకొన్న ఈ వివాదం కారణంగా జాతర పనుల టెండర్ల ప్రక్రియపై నీలినీడలు కమ్ముకున్నాయి.

### కొండా సురేఖ మంత్రి పదవి ఊస్టింగ్?

కొండా సురేఖను మంత్రి పదవి నుండి తొలగించనున్న రేవంత్ రెడ్డి? ..ఏకంగా టెండర్ల పేర్లతో , సెటిల్మెంట్ల పేర్లతో దోపిడీ జరుగుతుంది అని సిట్టింగ్ మినిస్టర్ కూతురే బయట పెట్టడంతో కంగు తిన్న రేవంత్ రెడ్డి వర్గం. సీఎం అనుచరుడు రోహిన్ రెడ్డి దందాలు, సీఎం బ్రదర్స్ కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి గురించి, రేవంత్ అంతర్గత విషయాలు బహిరంగంగా మీడియా ముందు ప్రస్తావించినందుకు కొండా సురేఖపై వేటు వేసేందుకు రేవంత్ రెడ్డి సిద్ధమైనట్లు సమాచారం. ఈరోజు జరిగే కేబినెట్ సమావేశంలో కొండా సురేఖపై వేటు వేసే అంశంపై కీలక చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

ఈ నేపథ్యంలో, వివాదాలకు తావు లేకుండా, పనులు వేగవంతం చేసి, నాణ్యతతో కూడిన వసతులు భక్తులకు కల్పించాలనే ఏకైక లక్ష్యంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. R&B శాఖ పర్యవేక్షణలో మేడారం పనులు ఇకపై ఎలాంటి అవాంతరాలు లేకుండా వేగంగా సాగుతాయని, రాబోయే జాతరకు అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తవుతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.




## గుడ్ న్యూస్..
### ఇకపై రైల్వే టికెట్‌లో తేదీ మార్పు

భారతీయ రైల్వే టికెటింగ్ విధానంలో కీలక మార్పులు చేసింది. ఇకపై ప్రయాణికులు తమ ధృవీకరించిన టికెట్‌ను రద్దు చేయకుండానే వేరే రోజుకు మార్చుకోవచ్చు. IRCTC వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. సీట్ల లభ్యతను బట్టి కొత్త తేదీ లేదా రైలును ఎంచుకోవచ్చు. అదనపు ఛార్జీలు లేకుండా, ఛార్జీల వ్యత్యాసం (ఏదైనా ఉంటే) మాత్రమే చెల్లించాలి. ఈ కొత్త విధానం ప్రయాణికుల డబ్బు, సమయం ఆదా చేయడంతో టికెట్లను రీషెడ్యూల్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తుంది.

## కరూర్ దుర్ఘటనకు కారణం
# విజయ్ ఆలస్యమే

కరూర్‌లో 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) రోడ్‌షోలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందటానికి ఆ పార్టీ నాయకుడు ఏడు గంటలు ఆలస్యంగా రావటమే కారణమని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. కరూరులో జరిగిన దుర్ఘటన రాష్ట్రంలోని ప్రజలందరినీ దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఆ దుర్ఘటనలో మృతిచెందిన 41 మంది కుటుంబాలకు సభాముఖంగా తన ప్రగాఢ సంతాపం ప్రకటిస్తున్నానన్నారు. కరూర్‌లో రోడ్‌షో జరిపేందుకు టీవీకే స్థానిక నాయకులు ముందుగా అడిగిన ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బంది అధికంగా ఉంటుందనే పోలీసులు అనుమతి నిరాకరించారని తెలిపారు. సెప్టెంబర్ 25న లైట్‌హౌస్ కార్నర్, ఉళవర్ సంత (రైతు బజార్) ప్రాంతాల్లో రోడ్ షోకు అనుమతి కోరారని, ఆ ప్రాంతాల్లో భద్రత కల్పించడం కష్టమని పోలీసులు అనుమతి నిరాకరించారని చెప్పారు. చివరకు టీవీకే కరూర్ వెస్ట్ జిల్లా కార్యదర్శి కోరిక మేరకు 11 నిబంధనలతో వేలుచ్చామిపురం వద్ద రోడ్‌షోకు అనుమతించినట్లు చెప్పారు. కరూర్ రోడ్‌షోకు పటిష్టమైన భద్రత కల్పించలేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని, రెండు రోజుల క్రితం అక్కడ అన్నాడీఎంకే నేత ఈపీఎస్ రోడ్‌షో ప్రశాంతంగా ముగిసిందని, ఆ రోడ్‌షోకు సుమారు



300 మంది పోలీసులతో భద్రత కల్పించామని గుర్తు చేశారు. అదే సమయంలో సెప్టెంబర్ 27 రాత్రి జరిగిన టీవీకే రోడ్‌షో సందర్భంగా కరూరు జిల్లా ఎస్పీ నాయకత్వంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామని, ముగ్గురు ఎస్పీలు, ఐదుగురు డీఎస్పీలు, 18 మంది సీఐలు, 75 మంది ఎస్ఐలు, సాయుధ దళాలు సహా 5 వందల మందికి పైగా పోలీసులతో బందోబస్తు కల్పించినట్టు తెలిపారు. అంతే కాకుండా పొరుగు జిల్లాల నుండి ఓ ఎస్పీ. ఇద్దరు సీఐలు, 89 మంది ఎస్ఐలు, 60 మంది సాయుధ దళ కానిస్టేబుళ్లు, టాస్క్‌ఫోర్స్‌కు చెందిన 20 మంది కానిస్టేబుళ్లు సహా 91 మందితో భద్రతను పెంచామని స్టాలిన్ వివరించారు. రోడ్‌షోకు సుమారు 10 వేల మంది దాకా వస్తారని టీవీకే నిర్వాహకులు పోలీసు ఉన్నతాధికారులకు తెలిపారని, అయితే టీవీకే నేత ప్రయాణించిన వాహనాన్ని వెంబడిస్తూ వేల సంఖ్యలో జనాలు వేలుచ్చామిపురం చేరుకోవటంతో తొక్కిసలాట జరిగాయని వివరించారు.

## పాక్ సైనికుల దుస్తులను
## బహిరంగంగా ప్రదర్శించిన తాలిబన్లు

అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్లు పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత ఆ దేశ విదేశాంగ మంత్రి తొలిసారిగా భారత్‌లో పర్యటించారు. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ పునరుద్ధరించాయి. అయితే దీనిపై దాయాది పాకిస్థాన్ తన అక్కసును వెళ్లగక్కింది. తాలిబన్లు భారత్‌కు దగ్గరవుతుండటంతో ఆగ్రహించిన పాక్ పాలకులు తమ సైన్యాన్ని ఉసిగొల్పారు. అఫ్ఘాన్‌లోని కాందహార్ ప్రావిన్సు, పాక్‌లోని బలోచిస్థాన్ ప్రాంతం మధ్య ఉన్న కీలక సరిహద్దు జిల్లా స్పిన్ బోల్డక్‌లో మంగళవారం అర్ధరాత్రి పాక్ సైనికులు దాడులకు పాల్పడ్డారు. దీంతో 15 మంది మరణించగా, 100 మందికిపైగా గాయపడ్డారని అఫ్ఘాన్ పాలకులు ప్రకటించారు.







## ట్రంప్‌ను చూసి
# మోదీ భయపడ్డారు
### రాహుల్ గాంధీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపేస్తానని మోదీ హామీ ఇచ్చారని ట్రంప్ వెల్లడించిన నేపథ్యంలో రాహుల్ స్పందించారు. ట్రంప్ నుంచి ఎలాంటి సానుకూల స్పందన లేకపోయినా మోదీ తరచూ అభినందన సందేశాలు ఎందుకు తెలుపుతున్నారని ప్రశ్నించారు. ట్రంప్‌ను చూసి మోదీ భయపడ్డారని వ్యాఖ్యానించారు. కాగా, ఆయన మాటలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## హాస్టల్ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆందోళన

పాపన్నపేట మండల కేంద్రంలోని హాస్టల్ ను ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పాపయ్య, మండల అధ్యక్షులు పర్వయ్య పర్యటించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. కాస్మోటిక్, మెస్ ఛార్జీలను వెంటనే సకాలంలో చెల్లించాలని, విద్యార్థులకు స్వెటర్లు, బ్లాంకెట్స్ ఇవ్వాలని గురువారం వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో అన్ని సదుపాయాలు కల్పించాలని, పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరుణ్, క్రిష్, గణేష్, విక్రమ్ లు పాల్గొన్నారు.



# సిద్ధుకి సినిమా అంటే పిచ్చి

సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రలలో నటిస్తున్న సినిమా తెలుసు కదా. నీరజా కోన దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 17న గ్రాండ్ గా విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ వేడుకలో హీరోయిన్ శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఇది చాలా స్పెషల్ ఫిలిం. నాకు కథ చాలా నచ్చింది. ఇందులో రాగానే క్యారెక్టర్ లో కనిపిస్తాను. నీరజ అద్భుతంగా రాసింది. నీరజ గారి విజన్ మీ అందరికీ నచ్చుతుంది. తన నుంచి మరిన్ని మంచి సినిమాలు రావాలని కోరుకుంటున్నాను. జ్ఞాన శేఖర్ గారు సినిమాని అద్భుతంగా విజువలైజ్ చేశారు. ఈ సినిమాకి పనిచేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. మా ప్రొడ్యూసర్స్ విశ్వ గారికి కృతి గారికి థాంక్యూ. ఈ సినిమాకి వాళ్ళు బ్యాక్ బోన్. తమన్ గారు అద్భుతమైన ఆల్బమ్ ఇచ్చారు రాశిఖన్నాతో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్పీరియన్స్. అంజలి క్యారెక్టర్ ని అద్భుతంగా పెర్ఫాం చేసింది. సిద్ధు గారి జర్నీ ఇన్స్పిరేషన్. తను వండర్ఫుల్ కోస్టర్. తనతో మరిన్ని సినిమాలు చేయాలని ఉంది. అక్టోబర్ 17న సినిమా థియేటర్స్ లో చూడండి తప్పకుండా మిమ్మల్ని ఎంటర్టైన్ చేస్తుంది.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM


# కుర్రకారుకు చెమటపట్టిస్తోందిగా

ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి రోజు రోజుకు గ్లామర్ డోస్ పెంచుతూ అందరినీ ఆకట్టుకుంటుంది. కెరీర్ మొదట్లో చాలా పద్ధతిగా కనిపించిన ఈ మధ్య గ్లామర్ డోస్ పెంచి, హాట్ హాట్ లుక్స్‌తో కుర్రకారును మాయ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ గ్రీన్ కలర్ ట్రెండీ డ్రెస్‌లో అదిరిపోయే లుక్‌లో ఫొటోలకు ఫోజులిచ్చింది. మరి మీరు కూడా ఆఫొటోస్ పై ఓ లుక్ వేయండి.అందాల చిన్నది కృతి శెట్టి గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఈ బ్యూటీ ఉప్పెన సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయమై, మొదటి సినిమాతో అందరినీ మాయ చేసింది. ముఖ్యంగా తన గ్లామర్‌తో కట్టిపడేసి, యూత్ ఫేవరెట్ అయిపోయింది.ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తూనే బ్లాక్ బస్టర్ తన ఖాతాలో వేసుకోవడంతో, స్టార్ హీరోయిన్‌గా టాలీవుడ్‌లో ఈ బ్యూటీ సత్తా చాటుతుంది అని అందరూ అనుకున్నారు. కానీ ఈ అమ్మడుకు మాత్రం మొదటి సినిమా తర్వాత లక్కు కలిసిరాలేదనే చెప్పాలి. ఎందుకంటే? ఉప్పెన తర్వాత ఈ అమ్మడుకు అనేక సినిమాల్లో ఛాన్స్‌లు వచ్చాయి. వరసగా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ, ప్రతి సినిమా చేసింది.



# పాకిస్తాన్‌ను అమ్మేశారంటూ షెహబాజ్ షరీఫ్‌పై విమర్శలు

ఈజిప్ట్‌లోని షర్మ్ ఎల్ షేక్‌లో జరిగిన గాజా సదస్సులో పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ప్రవర్తన ఇప్పుడు ఇంటా బయటా తీవ్ర విమర్శలకు కారణం అయింది. ఆ సదస్సులో తన ప్రశంసలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను షెహబాజ్ షరీఫ్ ఆకాశానికి ఎత్తేశారు. ట్రంప్ శాంతికాముకుడు అంటూ షరీఫ్ చేసిన పొగడ్తలతో అంతా షాక్ అయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత్-పాకిస్తాన్ యుద్ధాన్ని ఆపినందుకు ట్రంప్‌కు షెహబాజ్ షరీఫ్ ధన్యవాదాలు తెలిపారు. ఇక ఈసారి ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి దక్కకపోవడంపై స్పందించిన పాక్ ప్రధాని.. మళ్లీ నామినేట్ చేస్తానని తేల్చి చెప్పారు. దక్షిణాసియాలోనే కాకుండా.. మిడిల్ ఈస్ట్ దేశాల్లో కూడా లక్షలాది మంది జీవితాలను కాపాడినందుకు ట్రంప్‌ను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేస్తానని షెహబాజ్ షరీఫ్ తెలిపారు. ఇక పక్కనే షెహబాజ్ షరీఫ్ ప్రశంసలు కురిపిస్తుంటే.. చిరునవ్వుతో స్పందించిన ట్రంప్.. వావ్, నేను ఇది ఊహించలేదు అని అంటున్నారు. తన ఐదు




నిమిషాల ప్రసంగంలో షెహబాజ్ షరీఫ్.. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ కోసం కృషి చేసినందుకు ట్రంప్‌పై పదే పదే ప్రశంసల వర్షం కురిపించారు. సమకాలీన చరిత్రలో ఇది గొప్ప రోజని.. ఎందుకంటే శాంతికాముకుడైన ట్రంప్ అవిశ్రాంత ప్రయత్నాల వల్ల శాంతి లభించిందని షెహబాజ్ షరీఫ్ తెలిపారు. ఒకవేళ భారత్-పాక్ వివాదంలో ట్రంప్ జోక్యం చేసుకోకపోయి ఉంటే.. ఏం జరిగిందో చెప్పడానికి ఎవరూ జీవించి ఉండని స్థాయికి రెండు దేశాల మధ్య సైనిక సంఘర్ష పెరిగి ఉండేదని షెహబాజ్ షరీఫ్ పెద్ద పెద్ద వ్యాఖ్యలు చేశారు. తమ ప్రాంతంలో శాంతిని ప్రోత్సహించడంలో ట్రంప్ చేసిన అద్భుతమైన, అత్యుత్తమ కృషికి గుర్తింపుగా.. ఆయనను నోబెల్ శాంతి బహుమతికి పాకిస్తాన్ నామినేట్ చేసిందని.. అయితే శాంతి పట్ల ట్రంప్‌కు ఉన్న ప్రేమకు మనం చేయగలిగే అతి తక్కువ పని ఇదేనని షరీఫ్ చెప్పుకొచ్చారు. అయితే ట్రంప్‌ను షెహబాజ్ షరీఫ్ అతిగా పొగడటాన్ని పలువురు పాకిస్తానీ రాజకీయ నాయకులు, చరిత్రకారులు, నెటిజన్లు సోషల్ మీడియాలో తీవ్రంగా ఖండించారు. దీనిపై పాకిస్తానీ రాజకీయ నేత, చరిత్రకారుడు అమ్మర్ అలీ జాన్.. ఎక్స్‌లో స్పందించారు. డొనాల్డ్ ట్రంప్‌ను అనవసరంగా షెహబాజ్ షరీఫ్ పొగడటం ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాకిస్తానీయులకు అవమానకరమని పేర్కొన్నారు. ట్రంప్ తన షూ పాలిష్ చేయించుకోవాలని అనుకున్నప్పుడల్లా పాకిస్తాన్ ప్రధానమంత్రిని ఆహ్వానిస్తాడని.. కాలమిస్ట్ ఎస్ఎల్ కాంతన్ షరీఫ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భౌగోళిక రాజకీయాల్లో ఇంతటి అతిశయోక్తిని తాను ఎప్పుడూ చూడలేదని విమర్శలు గుప్పించారు. షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యలు, పొగడ్తలు.. 24 కోట్ల మంది పాకిస్తాన్ ప్రజలకు అవమానకరమని.. నెటిజన్లు పేర్కొంటున్నారు. కొన్ని బిలియన్ డాలర్ల కోసం ఈ తోలుబొమ్మలు (షెహబాజ్ షరీఫ్) పాకిస్తాన్‌ను అమ్మేశారంటూ మరికొందరు నెటిజన్లు ఆరోపించారు. ట్రంప్ మెప్పు పొందేందుకు ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేశారంటూ మండిపడుతున్నారు.




# మిత్రమండలి మూవీ రివ్యూ

జంగ్లీ పట్నంలో నారాయణ (వీటివి గణేష్) తుట్టె కులంలో ఒక పెద్ద మనిషి. కులం కోసం ప్రాణం ఇస్తాడు అవసరమైతే ప్రాణం తీస్తాడు. తన కులం ఓట్లు వాడుకొని ఎమ్మెల్యే కావాలి అనుకుంటాడు. అదే సమయంలో ఆయన కూతురు స్వేచ్ఛ (నిహారిక) ఇంట్లోంచి వెళ్ళిపోతుంది. కూతురు లేచిపోయింది అంటే కులపు ఓట్లు దూరమవుతాయని కిడ్నాప్ అయిందని నాటకం ఆడుతాడు నారాయణ. అదే సమయంలో అమ్మాయిని తీసుకెళ్ళింది చైతన్య (ప్రియదర్శి), అభి (రాగమయూర్), సాత్విక్ (విష్ణు), రాజీవ్ (ప్రసాద్ బెహరా) అనే చిల్లర గ్యాంగ్ అని తెలుస్తుంది. అసలు వాళ్లకు స్వేచ్ఛకు ఉన్న సంబంధం ఏంటి.. తర్వాత ఏమైంది.. వీళ్ళ మధ్యలో ఇంపార్టెంట్ క్యారెక్టర్ (సత్య) ఎందుకు వచ్చింది అనేది మిగిలిన కథ.. కామెడీ సినిమాలు చూసేటప్పుడు లాజిక్స్ అస్సలు పట్టించుకోకూడదు. అందుకే మిత్ర మండలి మొదలయ్యే ముందు టైటిల్ కార్డ్స్‌లోనే కథలేని కథ అని వేస్తారు. ఇందులో కథని ఆశించొద్దు అని ముందుగానే చెప్పాడు దర్శకుడు విజయేందర్. జస్ట్ కామెడీ ఎంజాయ్ చేయమని చెప్పాడు. మిత్ర మండలి బ్యాచ్ చేసే చిల్లర్ పనులు చూసి నవ్వుకోవాలంతే అని చెప్పాడు. నవ్వించడమే చాలా కష్టం అనుకుంటే.. కథ లేకుండా నవ్వించడం అనేది ఇంకా కష్టం.. అలాంటి మ్యాజిక్ చాలా తక్కువ సినిమాలకే సాధ్యమవుతుంది. ఆ లిస్టులో చేరదామని చేరలేకపోయింది మిత్ర మండలి.. కంటెంట్ లేదు.. సోది చెప్తున్నామంటూ ముందుగానే హింట్ ఇచ్చారు మేకర్స్. ఆ సోది అన్నిసార్లు వర్కవుట్ అవ్వదు.. కొన్నిసార్లు సోదిలో కలిసిపోతుంది. మిత్ర మండలి విషయంలోనూ ఇదే జరిగింది.. కథ ఎలాగూ లేదు.. కామెడీ అయినా వర్కవుట్ అయిందా అంటే అదీ లేదు. బలవంతంగా ఇరికించిన సీన్సే ఎక్కువగా ఉన్నాయి. సత్య మాత్రమే ఇంపార్టెంట్ క్యారెక్టర్ అంటూ వచ్చి నవ్వించాడు.. మనోడు ఉన్న ప్రతీ సీన్ బాగానే పండింది. మిత్ర మండలి కాసేపు ఎంజాయ్ చేయొచ్చంటే అది సత్య పుణ్యమే. వెన్నెల కిషోర్‌తో సత్య కాంబో సీన్స్ బాగున్నాయి. మిగిలిన వాళ్లలో ఎవరూ పెద్దగా ఆకట్టుకోలేదు.. అదే రొట్ట కామెడీ అనిపించింది. ప్రియదర్శిని కూడా సరిగ్గా వాడుకోలేకపోయాడు దర్శకుడు విజయేందర్. ఇందులో కథతో పాటు అక్కడక్కడా కులాలపై పంచులు కూడా వేసాడు దర్శకుడు. ముఖ్యంగా సొసైటిలో ఉన్న క్యాస్ట్ ఫీలింగ్స్‌పై సెటైర్లు వేసాడు. సామజవరగమనా సినిమాలోని వెన్నెల కిషోర్ పోషించిన కుల శేఖర్ పాత్రను గుర్తుకు తెస్తుంది ఇందులో గణేష్ చేసిన నారాయణ పాత్ర. ఫస్టాఫ్ చాలా వరకు బోరింగ్ సీన్స్ ఉన్నా.. సెకండాఫ్ అక్కడక్కడా బాగానే ఫన్ జనరేట్ అయింది. నిజం చెప్పాలంటే ప్రియదర్శి కామెడీ టైమింగ్ ఈ సినిమాలో పెద్దగా వాడుకోలేదు. అక్కడక్కడ నవ్వించాడు తప్ప పూర్తిస్థాయిలో కాదు. రాగమయూర్ విష్ణు ప్రసాద్ తమ తమ పాత్రలకు న్యాయం చేశారు. నిహారిక పర్లేదు. అనుదీప్ కె.వి ఉన్నది ఒక్క సీన్ అయినా కూడా నవ్వించాడు. వెన్నెల కిషోర్ కూడా బాగానే చేశాడు. ఈ సినిమాకు మెయిన్ పిల్లర్ సత్య. ఆయన క్యారెక్టర్ కు లాజిక్ లేకపోయినా కూడా కామెడీ మాత్రం అదిరిపోయింది. మిగిలిన వాళ్ళు తమ తమ పాత్రలకు న్యాయం చేశారు. కామెడీ సినిమాలకు సంగీతంతో పెద్దగా అవసరం ఉండదు. ఈ విషయంలో ఆర్ఆర్ ధ్రువన్ తనవంతు న్యాయం చేశాడు. పాటలతో పాటు బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా బాగానే ఉంది. సినిమాటోగ్రఫీ పర్లేదు. ఎడిటింగ్ ఫస్టాఫ్ వీక్.. సెకండ్ హాఫ్ ఓకే. నిర్మాణ విలువలు బాగానే ఉన్నాయి. దర్శకుడు విజయేందర్ కథ లేదు అని ముందే చెప్పాడు కానీ.. ఇందులో కామెడీ కూడా పెద్దగా వర్కౌట్ కాలేదు. ఒక్క సత్య క్యారెక్టర్ తప్ప మిగిలిన ఏది అంతగా నవ్వించలేదు.

# చికెన్ షాపులపై కీలక నిర్ణయం



రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ బోర్డ్, చికెన్ వ్యాపారంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి, నూతన లైసెన్సింగ్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ప్రతి చికెన్ షాపునకు లైసెన్స్ ఇవ్వడంతో పాటు, ఏ ఫారం నుంచి కోళ్లు వచ్చాయి, ఎవరికి విక్రయించారు అనే వివరాలను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇటీవల విజయవాడలో జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. వైసీపీ హయాంలో జరిగిన మాంసం మాఫియా అక్రమాలను బయటకు తీసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కూడా నిర్ణయించారు. ఈ సమావేశానికి సంస్థ చైర్మన్ చంద్రదండు ప్రకాశ్ నాయుడు అధ్యక్షత వహించారు.

# విరాట్ కోహ్లీ ఆసక్తికర ట్వీట్



ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ముందు భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఆసక్తికర పోస్టు పెట్టారు. 'పోరాటం ఆపాలని ఎప్పుడైతే నిర్ణయించుకుంటామో.. అప్పుడే మనం ఓడిపోయినట్లు' అంటూ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది. ఇప్పటికే టెస్టులు, టీ20ల నుండి రిటైర్ అయిన ఈ స్టార్ 2027 వన్డే ప్రపంచకప్ వరకూ కొనసాగుతారా..? లేక మధ్యలోనే రిటైర్ అవుతారా..? అన్న చర్చ నడుస్తోంది. అక్టోబర్ 19న పెర్త్‌లో ఆస్ట్రేలియాతో జరిగే తొలి వన్డే మ్యాచ్‌లో కోహ్లీ ఆడే అవకాశం ఉంది. ఈ మ్యాచ్‌కు ముందు కోహ్లీ పోస్టు పెట్టడం ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉండగా.. భారత్-ఆస్ట్రేలియా మధ్య వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్ అక్టోబర్ 19న పెర్త్‌లో జరుగనున్నది. భారత జట్టు ఈ నెల 15న రెండు బ్యాచ్‌లుగా ఆస్ట్రేలియాకు బయలుదేరి వెళ్తుంది. బీసీసీఐ వర్గాలు తెలిపిన వివరాల ప్రాకరం.. మొదటి బృందంలో ఆటగాళ్లు ఉదయం విమానంలో బయలుదేరి వెళ్తారు. రెండో బృందం సాయంత్రం వెళ్తుంది. బిజినెస్ క్లాస్ టిక్కెట్ల లభ్యత, ప్రయాణ ఏర్పాట్లపై ఆధారపడి ఉంటుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. చాలా రోజుల తర్వాత కోహ్లీ భారత జట్టు తరఫున మైదానంలోకి బరిలోకి దిగుతుండడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## భారత్ నిర్ణయాన్ని 'పెద్ద ముందడుగు'గా అభివర్ణించిన ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేస్తామని భారత ప్రధాని నరేంద్ర మోదీ తనకు హామీ ఇచ్చారని ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయం మాస్కోను ఆర్థికంగా ఏకాకిని చేసే అంతర్జాతీయ ప్రయత్నాలలో ఒక 'పెద్ద ముందడుగు' అని ఆయన అభివర్ణించారు.బుధవారం వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ ఈ కీలక విషయాన్ని తెలిపారు. "భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడంపై నేను సంతోషంగా లేను. అయితే, ఇకపై కొనబోమని ఈరోజు ఆయన నాకు హామీ ఇచ్చారు" అని ట్రంప్ పేర్కొన్నారు. దీని తర్వాత చైనాను కూడా ఇదే విధంగా ఒప్పిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో రష్యా చమురు ఆదాయానికి గండికొట్టేందుకు వాషింగ్టన్ తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే.